ఆర గంట తర్వాత ఆయన స్టూడియోలో మైక్ ముందు కూర్చొని తిరుగుతున్న గడియారం ఎర్ర సెకన్ల ముల్లు వంక చూస్తున్నాడు.

సరిగా సమయం అవగానే వార్తలు చదవసాగాడు.

"ఆకాశవాణి.... ప్రాంతీయ వార్తలు చదువుతున్నది వృక్షాయుర్వేదాచార్యులు .... జంట నగరాలలో నేడు ప్రతిపక్షాలు నిర్వహించిన బంద్ ఎలాంటి హింసాత్మక చర్యలు లేకుండా శాంతియుతంగా జరిగింది. పౌర జీవనానికి ఎలాంటి అంతరాయాలు కలగటం కాని, అది స్తంభించటం కాని జరగలేదు...."

ఆ వాక్యానికి, మరో వాక్యానికి మధ్య ఆయన తీసుకున్న వ్యవధిలో అను కున్నాడు.

"ఈ వుద్యోగులలో చేరబట్టే నాకు కూతుళ్ళు తప్ప కొడుకులు లేరు."

# ఇడ్లీకి ఓ కథ వుంది

ప్రియమైన అమ్మకు నీ చతుర్థ పుత్రుడు నమస్కరించి వ్రాయునది.

నేను క్షేమం. నాన్నగారు, సుశీలక్క కులాసా అని భావిస్తున్నాను. బుజ్జిగాడెలా వున్నాడు? రమణక్క నించి మొన్నీ మధ్య ఉత్తరం వచ్చింది. ఒకసారి ఎవరైనా వెళ్ళే వాళ్ళు వుంటే మన దొడ్డిలోని కరివేపాకు మొక్కలు, అరటి పిలకలు పంపమని నీకు రాయమంది. మాకువచ్చే మూడు డి.ఏ.డు పెంచారు. నెలకి ఏభై దాకా జీతం పెరిగిందన్న మాట. ఆ డబ్బుని స్టైయిన్ లెస్ స్టీల్ దుకాణంలో లాటరీ స్కీములో కడుతున్నాను.

రమణక్క, సుశీలక్క, ఈశ్వరక్కల వల్ల నాకు వంట చేసే అవకాశం, చీరాలలో నీదగ్గర వున్నంత కాలం రానందుకు ఇప్పుడు విచారిస్తున్నాను. ఫిబ్రవరి దాకా నాకు భోజన సౌకర్యాలు ఎంతో వసతిగా వుండేవి. ఈ మెయిన్ రోడ్డులో చలమయ్య మెస్‌లో టిఫిన్, భోజనం ఎంత బావుండేవో, క్రితం సారి నీవు ఈశ్వరక్క సంబంధం కోసం వచ్చినప్పుడు నీకు తెలుసు.

ఉదయం పదయ్యే సరికల్లా వేడి వేడి ఇడ్లీ మీద ఇంత వెన్న వేసి చిక్కటి ములక్కాడల సాంబారు, పచ్చి కొబ్బరి. శనగ పప్పు కలపి చేసిన చెట్నీ వుండేది మనం ఎంతో ఇష్టంగా తినే వాళ్ళం. భోజనం కూడా రుచిగా వుండటంతో నువ్వు అన్నం తినేంత కాలం పెళ్ళి పెటాకులు చేసుకోవు" అని డైరెక్టుగా నన్ను తిట్టి, ఇన్‌డైరెక్టుగా చలమయ్యని మెచ్చుకున్నావు.

ఫిబ్రవరి నుంచి ఆ రోజులు పోయేయమ్మా. ఆ రోజులు పొయ్యాయి మళ్ళీ ఆ బంగారు రోజులు ఎప్పుడైనా వస్తాయా అని పిస్తోంది. సర్కారు వారు పేద వాళ్ళ మీద సానుభూతితో సినిమా టిక్కట్లు ధరలు పెంచారు సినిమాలు చూసి డబ్బు పాడు చేసుకోరాదని. క్రింది తరగతి పేద వాళ్ళు వెళుతూనే వున్నారు. కాని పై తరగతి పేద వాళ్ళు మానేసారు. దాంతో థియేటర్స్ వాళ్ళు తమంతట తామే ధరలు తగ్గించి అన్ని తరగతుల పేద వాళ్ళని ప్రభుత్వ వైకరికి వ్యతిరేకంగా ఇంకా పేదవాళ్ళు చేసున్నారు.

అలాగే పేదవారి కోసం సర్కారివారు హోటల్ రేట్లు తగ్గించి మేలు చేసారు. ఇప్పుడసలు హోటల్‌కి వెళ్ళలేక పోతున్నానమ్మా! హోటల్‌కే వెళ్ళలేక పోతున్నాను.

ఉదయం ఎనిమిదిన్నరనించి పదిన్నర దాకా రేట్లు తగ్గింపు నేను లెమిలి బయట పడి హోటల్ కెళ్ళేది ఎనిమిది ముప్పావు తొమ్మిదికి. ఆ సమయంలో ఇడ్లీధర తగ్గటంతో హోటల్ వాళ్ళకి గిట్టుబాటు కాదని కడిగీ కడగని ప్లేట్లలో, వుడికీ వుడకని ఇడ్లీలని కాగీ కాగని సాంబారుతో రుచి

కనుక్కోలేని చెట్నీతో ఇస్తున్నారు. అది తింటున్నప్పుడు నరకంలో వుంటున్న ఫీలింగు. తిన్నాక హాస్పటల్‌కి వెళ్ళాలన్న ఫీలింగ్. ఆ సమయంలో మంచినీళ్ళు అడగ కూడదట పదకొండింటికి మంచి ఇడీ దొరికే సమయంలో ఆఫీస్‌లో వుంటామాయె మళ్ళీ భోజన సమయంలో వడ్డించే జనతా భోజనం గురించి రాసే ఆనక అన్నం సహించదు ఆకలితో నకనక లాడుతూ సాయంత్రం ఆఫీసు నించి ఏ హోటల్ కెళ్ళినా మళ్ళీ రాత్రి ఎనిమిదిన్నరదాకా ఉదయం చెప్పు ఇడ్లీ, సాంబారు, చట్నీ. నాకు వుప్మా, ఇడ్లీ, వడ తప్ప ఇంకేం సహించవు అని నీకు తెలుసుగా. అయినా మసాలా దోసె లాంటివి అలవాటు చేసుకుందామంటే అవీ అంతే. ఈ ఇడ్లీల లాంటి సర్కారు ఆంక్షలు టిఫిన్ లలో వచ్చే నష్టం వాటిలో కవర్ చేసుకోడానికి వాటిని అలా మార్చే సారుట కొన్ని హోటళ్ళలో స్పెషల్ ఇడ్లీ అన్నారు ఆ మధ్య. దాంట్లో కేరట్ ముక్కలు వేసి రూపాయి పావల ప్లేట్ అనేవారు. ఎనభై పైసలు మంచి ఇడ్లీ ఇలా రుచి మారింది ధర పెరిగడం ఎంత దురదృష్టం! ఇప్పుడు ఆ ప్రత్యేక ఇడ్లీల అమ్మకం నిషేధించారుట.

ఈ కారణాల వల్ల, నేను ఇంత కాలం పెళ్ళంటే చూసిన విముఖతని ప్రక్కన పెట్టి వివాహం చేసుకోవాలను కుంటున్నాను. ఆ చీపురుపల్లి వారి సంబంధం ఖాయం చేయించి ముహూర్తం ఎప్పుడో రాయి. ఆ అమ్మాయికి వంట రాకపోతే పెళ్ళయ్యాక నెలరోజులు దగ్గరుంచేసుకుని వంట నేర్పించు

ఆంధ్రదేశంలో హోటల్ కెళితే శుభ్రంగా కడిగిన పళ్ళేలతో చక్కటి ఫలహారం చేసే బంగారు రోజులు తిరిగి మళ్ళీ వస్తే తిరుపతి కొండ నడచి ఎక్కుతామని మారూమ్ మేట్స్ మొక్కుకున్నాం.

హైదరాబాద్
మేడే 1984

నీ ప్రియ పుత్రుడు
సి హెచ్ వెంకటేశ్వరరావు